క్లుప్తంగా

నేడు జగనన్న సురక్ష శిబిరం

నారాయణవనం: నారాయణవనం–2 సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీ డీఓ గుణశేఖర్ తెలిపారు. ఉదయం 9 గంటలకు సచివాలయంలో ప్రారంభమయ్యే శిబిరంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొంటారని చెప్పారు. మండలస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొనాలని కోరారు.

నేడు ముడియూరులో..

పిచ్చాటూరు: మండలంలోని ముడియూరు సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం 10 గంటలకు హాజరై సర్టిఫికెట్లను ప్రజలకు పంపిణీ చేస్తారన్నారు.

నేడు ఇందిరానగర్‌లో ...

వరదయ్యపాళెం: మండలంలోని ఇందిరానగర్ గ్రామ సచివాలయంలో మంగళవారం జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొంటారని ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి

ఏర్పేడు: ఏర్పేడు గ్రామ పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య తెలిపారు. ఆయన సోమవారం శ్రీకాళహస్తి, తిరుపతి ప్రధాన రహదారి పక్కన స్టేట్ బ్యాంకు వద్ద మురుగు కాలువ మరమ్మతులు చేపట్టారు. కాలువ పూడిపోవడంతో మురుగునీరు కదలక దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు ఆయనకు వివరించారు. స్పందించిన సర్పంచ్ జేసీబీతో కాలువ పూడికతీత పనులు చేపట్టి సమస్యను పరిష్కరించారు. ఉప సర్పంచ్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న టీచర్లు

శ్రీకాళహస్తి: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఊరందూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజకుమారి తెలిపారు. ఆమె సోమవారం ఉపాధ్యాయులతో కలిసి జింగిలిపాళెం ఎస్టీకాలనీలో పర్యటించారు. కొందరు విద్యార్థులు తరచూ పాఠశాలకు గైర్హాజరు అవుతుండటంతో వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, వసతులు, పథకాల గురించి వివరించారు. చదువుకోవడం ద్వారా కలిగే లాభాలను తెలియజేశారు. సురేష్, మురళి, మల్లికార్జున, శ్రీనివాసులు, రమేష్‌బాబు, శాంతి, రజియా, సుమతి తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య బోధించాలి

శ్రీకాళహస్తి: పిల్లలకు విలువలతో కూడిన విద్యను బోధించాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బాలాజీ తెలిపారు. ఆ సంఘం తిరుపతి, చిత్తూరు జిల్లాల నూతన అభ్యాస వర్గ సమావేశాన్ని సోమవారం శ్రీకాళహస్తిలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ టీచర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. విశ్వేశ్వరరావు, కృష్ణంరాజు, మేకల సుబ్రహ్మణ్యం, నాగరాజు, సాంబిరెడ్డి, సుందరమూర్తి పాల్గొన్నారు.

అభయక్షేత్రంలో అన్నదానం



రేణిగుంట: రేణిగుంట బిస్మిల్లానగర్‌లో ఉన్న అభయక్షేత్రంలోని దివ్యాంగులకు సోమవారం తిరుపతి యువజన విభాగం అధ్యక్షుడు కొనిశెట్టి ప్రవీణ్ రాయల్ జన్మదినం సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీనివాసులురెడ్డి, చంద్రరాయల్, కొనిశెట్టి రాము పాల్గొన్నారు.

బిల్లులు ఇవ్వాల్సిందే

వరదయ్యపాళెం: ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకు ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని సత్యవేడు వ్యవసాయశాఖ ఏడీఏ సుబ్రమణ్యం సూచించారు. సోమవారం వరదయ్యపాళెం వ్యవసాయ కార్యాలయంలో మండల ఎరువులు, పురుగు మందుల విక్రయ డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి దుకాణం వద్ద ధరల సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు చేసే రైతులకు తప్పకుండా బిల్లులు ఇవ్వాలన్నారు. నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ అధికారి సుహర్‌లత ఉన్నారు.

నేడు బీజేపీ నేతల సమావేశం

సత్యవేడు: స్థానిక బేరిశెట్టి కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం బీజేపీ నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు జీ.ప్రతాప్ సోమవారం తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ఎస్.దయాకర్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సత్యనారాయణ పాల్గొంటారని పేర్కొన్నారు. స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

జనం మెచ్చేలా జగనన్న పాలన

- పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నాం
- సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం



సత్యవేడు: గంగమిట్ట వీధిలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు: రాష్ట్రంలో జనమంతా మెచ్చే విధంగా పాలన సాగించడం సీఎం జగన్‌మోహన్ రెడ్డికే సాధ్యమైందని, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఏకైక సీఎంగా కీర్తి పొందారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని సత్యవేడులో మూడో సచివాలయ పరిధిలో గడప గడపకు మనప్రభుత్వం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారికి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను, అందుతున్న తీరును లబ్ధిదారులతో మాట్లాడారు. పథకాలు అందకపోతే వలంటీర్లు, సచివాలయ పార్టీ కన్వీనర్ల సాయంతో కారణాలను తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని లబ్ధిదారులకు సూచించారు. మూడవ సచివాలయ పరిధిలో 2,120 మంది లబ్ధిదారులకు రూ.11.67 కోట్లు లబ్ధి పొందారన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు..

అరుంధతివాడలో ప్రభుత్వం 30 ఏళ్ల కిందట నిర్మించిన ఇళ్లు వర్షాలకు ఉరుస్తున్నాయని, మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని పలువురు దళితులు కోరారు. వీధుల్లో సిమెంటు రోడ్లు ఏర్పాటు చేయాలని విన్నవించారు. 1976లో ఇళ్ల పట్టాలు ఇచ్చిన స్థలాన్ని తెలుగుదేశం నాయకుడు శివయ్య శెట్టి ఆక్రమించారని, వాటిని తొలగించి తమకు ఇంటి పట్టాలు ఇప్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే తహసీల్దారు షేక్ జరీనాను పిలిచి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అరుంధతివాడలో సిమెంటు రోడ్లు వేసేందుకు నిధులు కేటాయించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను ఆదేశించారు. 15 మందికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. అలాగే పలు గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని కోరగా, పంచాయతీ అధికారులు డ్రైనేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ వి.ప్రతిమ, జెడ్పీటీసీ సభ్యురాలు పి.విజయలక్ష్మి, మండల కన్వీనర్ కే.సుశీల్‌కుమార్ రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్‌రెడ్డి, సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, ఎంపీటీసీలు గురుప్రసాద్, పునిదకుమార్, దయాళన్ హాస్పిటల్ కమిటీ సభ్యుడు గోవిందస్వామి, మార్కెటింగ్ కమిటీ సభ్యుడు ఎంపీ రవి, వ్యవసాయ కమిటీ సలహా సంఘం అధ్యక్షుడు శ్యాంప్రసాద్ రెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు మస్తానమ్మ, సర్పంచులు రవిరెడ్డి, శేఖర్‌బాబు, శ్రీనివాసులు రెడ్డి, మునివేలు, జయ, శ్రీరాములురెడ్డి, సన్యాసయ్య, రమణ, పూల పళణి, టెంకాయల కృష్ణయ్య, పంచాయతీరాజ్ డీఈ మధుసూదన్, ఎంఈఓలు రవి, ఉషా, హౌసింగ్ ఏఈ వెంకటసుబ్బయ్య, ఈఓపీఆర్డీ మునిరవికుమార్, సీడీపీఓ దేవకుమారి తదితరులు పాల్గొన్నారు.



ఆశావర్కర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

నియామక పత్రాల అందజేత

సత్యవేడు: దాసుకుప్పం పీహెచ్‌సీ పరిధిలో సత్యవేడు, మదనంబేడు, దాసుకుప్పం పంచాయతీల్లో నలుగురు ఆశా వర్కర్లకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నియామకపత్రాలు అందజేశారు. సోమవారం డాక్టర్ ఎస్.గుణశేఖర్ ఆధ్వర్యంలో జయశీల(సత్యవేడు), తేన్‌మొలి(మదనంబేడు), గౌరి(చెన్నేరి), లత (దాసుకుప్పం)కు నియామక పత్రాలు అందించి, పేదలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే ఆదిమూలం సూచించారు.

రుణాలు ఇప్పించాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న మహిళలు

వరదయ్యపాళెం: సకాలంలో బ్యాంకులకు రుణాలు చెల్లించిన వారికి మళ్లీ రుణాలు ఇప్పించాలని సోమవారం వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వంటావార్పుతో డ్వాక్రా మహిళలు నిరసన తెలిపారు. గతంలో వెలుగు కార్యాలయంలో ఏపీఎం, సంఘమిత్రాలు కొన్ని గ్రూపుల పేరిట రూ.3 కోట్ల వరకు డబ్బులు స్వాహా చేశారని ఆరోపించారు. ఈ విషయమై సీఎల్ఎన్ పల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో 7 డ్వాక్రా సంఘాలు సకాలంలో రుణాలు బ్యాంకులకు చెల్లించినప్పటికీ మరో బ్యాంకులో వారి ప్రమేయం లేకుండానే వారి పేరిట రుణాలు పొందడం వల్ల ప్రస్తుతం రుణాలు ఇవ్వలేమని వరదయ్యపాళెం ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వారు చెబుతున్నారని వాపోయారు. అక్రమ రుణాలు పొందిన వారిపై చర్యలు తీసుకుని తమకు రుణాలు ఇప్పించాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం వారు ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఉన్నతాధికారుల దృష్టికి అక్రమ రుణాల విషయాన్ని నివేదించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్, సీపీఐ జిల్లా మహిళా అధ్యక్షురాలు చెంచమ్మ, కార్యదర్శి నదియ, సీపీఐ నాయకులు తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు



ప్రత్యేక అలంకరణలో సొరకాయలస్వామి

నారాయణవనం: మండలవ్యాప్తంగా పలు ఆలయాల్లో సోమవారం అమావాస్య పూజలు నిర్వహించారు. తమిళ ఆడి నెల అమావాస్య కావడంతో తమిళులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. సొరకాయలస్వామి ఆలయంలో ఉదయం మూలవర్లక ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి, సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు అన్నప్రసాదాలను వితరణ చేశారు. అలాగే వీరరాఘవ స్వామి ఆలయంలో మధ్యాహ్నం అమావాస్య పూజల్లో మహిళలు, భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాలను పంపిణీ చేశారు. కైలాసనాథకోనలోని శివశక్తి, శాంతి ఆశ్రమాలలో అమావాస్య పూజలను నిర్వహించారు. కైలాసనాథకోనకు వచ్చిన భక్తులు, పర్యాటకులు ఆశ్రమాలలో చేపట్టిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని వినతి



డీఆర్వో కోదండరామిరెడ్డితో సమస్యలను వివరిస్తున్న సర్పంచ్ నిర్మల, రైతులు

ఏర్పేడు: మర్రిగుంట చెరువును అభివృద్ధి చేయాలని సర్పంచ్ నిర్మల, రైతులు కోరారు. వారు సోమవారం తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో డీఆర్వో కోదండరామిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆరులేన్ల రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా ఏర్పేడు మండలంలోని సీతారాంపేట వద్ద మర్రిగుంట చెరువు కలుజు, తూము, కట్టను తొలగించినట్లు వివరించారు. చెరువు కింద 300 ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. గత ఏడాది వర్షాకాలంలో చెరువు కట్ట, తూము, కలుజును తొలగించడంతో చెరువుకు నీరు చేరకపోవడంతో వరి పంట ఎండిపోయిందన్నారు. ఈ ఏడాదైనా చెరువును అభివృద్ధి చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. స్థానికులు కొందరు గ్రామ కంఠం భూములను ఆక్రమించి ఇళ్లు నిర్మిస్తున్నారని, ఆక్రమణలు తొలగించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు నాగరాజు, గురుశంకర్, కృష్ణయ్య, రంగయ్య పాల్గొన్నారు.

బంధువులకు మృతదేహం అప్పగింత

ఏర్పేడు: మండలంలోని డిక్షన్ కంపెనీ వద్ద ఆదివారం మృతిచెందిన లారీ డ్రైవర్ రామేశ్వర్(34) మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి సోమవారం రాత్రి తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రామేశ్వర్ ఆదివారం సాయంత్రం డిక్షన్ కర్మాగారానికి వాషింగ్ మెషిన్ల లోడు చేసుకోవడానికి వెళ్లాడని తెలిపారు. లారీని కంపెనీ వద్ద ఉంచి మూత్ర విసర్జన కోసం రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలంలోకి వెళ్లి కింది పడి మృతి చెందినట్లు వివరించారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు పేర్కొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా వింధ్య



బుచ్చినాయుడుకండ్రిగ: మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా వింధ్య బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న నీలిమ విజయవాడలోని ప్రధాన కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. తిరుపతిలోని ఈఈ కార్యాలయంలో పని చేస్తున్న వింధ్యను ఇక్కడికి బదిలీ చేశారు. మండలంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

శ్రీకృష్ణుడే జగద్గురువు

ఏర్పేడు: భగవద్గీత బోధించిన శ్రీకృష్ణుడే జగద్గురువని త్రైత సిద్ధాంత ప్రబోధ హిందూ జ్ఞానవేదిక శ్రీకాళహస్తి కమిటీ అధ్యక్షుడు చింత సుబ్రమణ్యం తెలిపారు. మండలంలోని దుర్గిపేరి, జంగాలపల్లి, రాజులపాలెంలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తీ త్రైత సిద్ధాంత భగవద్గీతను చదవాలని సూచించారు. వెంకటలక్ష్మి, సుధ, శ్రీనివాసులు, గుణసుందరి, ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

ఏర్పేడు: ఆటోను అతివేగంగా నడిపి ఇద్దరు గాయపడడానికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. ఆయన సోమవారం రాత్రి విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 15న తిరుపతికి చెందిన సర్వేశ్వర్ సాహూ (48), గీతారామ్ సాహూ (39) శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి బైక్‌లో వెళుతుండగా మేర్లపాక వద్ద ఆటో అతివేగంగా వస్తూ వారిని ఢీకొందని తెలిపారు. గాయపడిన వారిని 108లో శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించామన్నారు. ఆటో డ్రైవర్ జలాల్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

వాహనాల తనిఖీ

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రాఘవేంద్ర హెచ్చరించారు. ఆయన సోమవారం తొట్టంబేడు రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులు తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలని సూచించారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు.

ఇల్లు కూల్చడంతో వివాదం

రేణిగుంట: రేణిగుంట పాత చెక్‌పోస్ట్‌లో స్థల వివాదం రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. రేణిగుంట పాత చెక్‌పోస్ట్ వద్ద చర్చికి ఎదురుగా 40 ఏళ్లుగా మురుగ, సెల్వి దంపతులు టిఫిన్ సెంటర్ నడుపుతున్నారు. ఆ స్థలం చర్చికి చెందినదని, ఖాళీ చేయాలని చర్చి పెద్దలు తెలపడంతో మురుగ కుటుంబం సమయం కోరారు. గడువు లోపు ఇల్లు ఖాళీ చేయకుండా అడ్డుతిరగడంతో చర్చికి సంబంధించిన మహిళలు, కొందరు చర్చి పెద్దలు కలిసి సోమవారం రాత్రి జేసీబీతో ఆ ఇంటిని కూల్చారు. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఏమీ కాకుండా చర్యలు తీసుకున్నారు.

వైఎస్సార్‌సీపీలోనే ముస్లింమైనారిటీలకు పెద్దపీట

- రాజీవ్‌నగర్‌లో షాదీమహల్ నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు
- త్వరలో పనులు ప్రారంభం
- ఎమ్మెల్యే ఆదిమూలం చొరవతో 20 సెంట్ల స్థలం కేటాయింపు
- టీడీపీ సెల్ఫీ చాలెంజ్‌ను ఎండగట్టిన వరదయ్యపాళెం ముస్లింలు





మాట్లాడుతున్న ముస్లింలు, రాజీవ్‌నగర్‌లో షాదీ మహల్ కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలం

వరదయ్యపాళెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపడుతున్న పనులకు టీడీపీ నేతలు సెల్ఫీలతో ఫోజులు ఇవ్వడం సిగ్గుమాలిన చర్య అని వైఎస్సార్ సీపీ వక్ఫ్‌బోర్డు జిల్లా డైరెక్టర్ అబ్దుల్, కార్యదర్శి లతీఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం వరదయ్యపాళెంలో టీడీపీ వారు నిర్వహించిన బస్సు యాత్రలో రాజీవ్‌నగర్ వద్ద షాదీమహల్ నిర్మాణం కోసం గతంలో టీడీపీ స్థలాన్ని కేటాయించిందని నియోజకవర్గ ఇన్‌చార్జ్ హెలన్, మాజీ ఎమ్మెల్యే హేమలత సెల్ఫీ చాలెంజ్ చేయడాన్ని ముస్లిం మైనారిటీలు తీవ్రంగా ఖండించారు. సోమవారం సాయంత్రం రాజీవ్‌నగర్ వద్ద పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లింల అభ్యర్థన మేరకు స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చొరవతో రాజీవ్‌నగర్‌లోని మసీదుకు ఆనుకుని 20 సెంట్ల భూమిని కేటాయించారన్నారు. సంబంధిత భూమికి 4 నెలల కిందట ముస్లింలంతా కలసి ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. అంతేకాక షాదీమహల్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే చొరవతో రాష్ట్రప్రభుత్వం మైనారిటీస్ వెల్ఫేర్ ద్వారా రూ.25 లక్షలు మంజూరు చేయించారని వారు వివరించారు. త్వరలో సంబంధిత పనులు కూడా ప్రారంభం కానున్నట్లు తెలిపారు. 2019 ఎన్నికల ముందు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే ఆదిత్య రాజీవ్‌నగర్ మసీదు సందర్శనకు వచ్చినప్పుడు షాదీమహల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి అడ్రస్ లేకుండా వెళ్లారని వారు ధ్వజమెత్తారు. ప్రభుత్వం రాజకీయాలపై అవగాహన లేని హెలన్ తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే షాదీ మహల్ నిర్మిస్తానని ముస్లింలను మరోమారు ఏమార్చేందుకు ప్రయత్నిస్తున్నారని, వారి మాటలు ఎవరూ నమ్మరన్నారు. ఎమ్మెల్యే సహకారంతో వరదయ్యపాళెం మండలానికి వక్ఫ్ బోర్డులో రెండు డైరెక్టర్ పదవులను కేటాయించారన్నారు. కార్యక్రమంలో ముస్లింపాళెం సర్పంచ్ అబ్దుల్ మజీద్, మైనారిటీ సెల్ నాయకులు చాన్‌బాషా, అక్బర్, రియాజ్, సిద్ధిక్, రఫీ, ఫజుల్ పాల్గొన్నారు.

కనుల పండువగా ఆణివార ఆస్థానం



కల్యాణ వెంకన్నకు ఆణివార ఆస్థానం నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం ఆణివార ఆస్థానాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజాది కార్యక్రమాలను పూర్తి చేశారు. తిరువాడిపుర ఉత్సవాల సందర్భంగా గోదాదేవికి, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్నకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం గంట, నైవేద్యం తదితర నిత్యకైంకర్యాలని అర్చకులు నిర్వహించారు. ఊంజల్ మండలంలో శేషవాహనంపై ఉభయదేవరుల సమేత వెంకన్నను కొలువుదీర్చారు. ఈ సందర్భంగా టీటీడీ తరఫున ఆలయ అధికారి నాగరాజు పట్టువస్త్రాలను సమర్పించారు. అర్చకులు ఆస్థానం నిర్వహించి భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

ముక్కంటిని దర్శించుకున్న ప్రముఖులు





ఏబీవీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి శుక్ల, డిప్యూటీ హైకమిషనర్‌కు జ్ఞాపిక ఇస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో బ్రిటీష్ హైకమిషనర్ గ్యారెట్ విస్ ఒవెన్, ఏబీవీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి శుక్ల ఉన్నారు. వారికి పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. హరికృష్ణ, పీవీఆర్ గ్రూప్స్‌డైరెక్టర్ జనార్దన్‌రావ జె పవార్, పరమేశ్వరరావు వి ప వార్, రమణమూర్తి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్యసరళితోనే వ్యవసాయం లాభదాయకం



రైతులకు పవర్ స్ప్రేయర్లు అందజేస్తున్న వెంకటరత్నం

రేణిగుంట: వ్యవసాయాన్ని వాణిజ్య సరళితో చేపడితేనే రైతులకు ఆశించిన లాభాలు వస్తాయని రాస్ జనరల్ సెక్రటరీ, కేవీకే చైర్మన్ ఎస్.వెంకటరత్నం తెలిపారు. కరకంబాడి రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన సాంకేతిక విజ్ఞాన దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ యాంత్రీకరణతోపాటు శాస్త్రవేత్తల సలహాలు, మార్కెట్, వినియోగదారుల డిమాండ్ ఆధారంగా పంటలను ఎంపిక చేసుకోవాలన్నారు. రైతులు ఉత్పత్తిదారు సంఘాలుగా ఏర్పడి పంట ఉత్పత్తి అమ్మకాలు చేపట్టాలని సూచించారు. తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా మండలి సహ పరిశోధన సమాచాలకులు సి.రమణ మాట్లాడుతూ వ్యవసాయంలో ప్రధానంగా నెలకొన్న కూలీల సమస్యను వ్యవసాయ యాంత్రీకరణతో అధిగమించాలన్నారు. కేవీకే తయారు చేసిన ప్రచురణలను విడుదల చేశారు. భారతీయ వరి పరిశోధనా సంస్థ – షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక కింద వరి రైతులకు జింక్ సల్ఫేట్, కమ్యూనిటీ వినియోగం కోసం బ్యాటరీ, పవర్ స్ప్రేయర్లు, నారు మొక్కలు, జీవన ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త టి.ప్రతిమ, ధనుంజయరెడ్డి, పట్టుశాఖ జిల్లా అధికారి గీతారాణి, ఉద్యాన అధికారి పుష్పలత, రాస్ కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వేకు సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న భార్గవి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో త్వరలో జరగనున్న భూ సర్వేకు క్షేత్రస్థాయి సిబ్బంది సిద్ధం కావాలని తహసీల్దారు భార్గవి తెలిపారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న భూసమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలని, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. భూమి లేని పేదలను గుర్తించి, అర్హులైన వారికి భూ పంపిణీ చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. పరిష్కారానికి నోచుకోని రెవెన్యూ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. చెరువుల ఆక్రమణలు ఉంటే అడ్డుకోవాలని, రైతుల భూములకు సంబంధించిన సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డీటీలు శివయ్య, చంద్రబాబు, ఆర్ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు సమయపాలన పాటించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహారావు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలవ్యాప్తంగా ప్రభుత్వ స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేయాలని, అధికారులు సైతం సమయపాలన పాటించాలని ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు తమ పరిధిలోని సమస్యలను ప్రస్తావించారు. గ్రామ సచివాలయాల్లో సిబ్బంది పనితీరు సరిగా ఉండడం లేదని, సమయపాలన పాటించడం లేదని, ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని ప్రస్తావించారు. గతంలో జరిగిన నాలుగు సమావేశాల్లో లేవనెత్తిన సమస్యల్లో ఒక సమస్య కూడా పరిష్కారానికి నోచుకోలేదని పలువురు సభ్యులు తెలిపారు. దీనిపై ఎంపీడీఓ నరసింహారావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను తెలియజేస్తే క్షేత్రస్థాయిలో సిబ్బంది వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే కాటూరు గ్రామదళితవాడలో శ్మశానం లేకపోవడంతో చెరువు కట్టపై శవాలను పూడ్చుతున్నామని ఎంపీటీసీ సభ్యుడు రవి సభలో ప్రస్తావించారు. దీనిపై తహసీల్దారు భార్గవి స్పందిస్తూ ఈ నెల ఆఖరిలోపు మండలంలోని అన్ని గ్రామాల్లో శ్మశాన స్థలాలను సర్వే చేసి, సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు అరణివిద్యానాథ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఉగ్గుమూడి సంధ్య, వైస్ ఎంపీపీలు మునికృష్ణారెడ్డి, మున్నెమ్మ, సీడీపీఓ దేవకుమారి, కోఆప్షన్ మెంబరు ఇమామ్‌బాషా, ఎంఈఓ రవీంద్రనాథ్, వ్యవసాయాధికారి భారతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వింధ్య, హౌసింగ్ ఏఈ సుబ్రమణ్యం, విద్యుత్‌శాఖ ఏఈ పుణ్యకోటి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

ఏర్పేడు: మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం అవుతాయని, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం అధికారి ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ శిల్ప ఆధ్వర్యంలో మానసిక సమస్యలు–పరిష్కార మార్గం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యవ్వనంలో ఉద్రేకాలు, ప్రవర్తనలో మార్పులు ఉంటాయని సూచించారు. ఆకర్షణకు లోనుకాకుండా ఉండాలన్నారు. డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాల వాడకంతో శారీరక, నరాల బలహీనత, వ్యాధి నిరోధక శక్తి తగ్గుదల, ఆత్మహత్యలకు పాల్పడడం, తల్లిదండ్రులు, పెద్దలు, ఉపాధ్యాయులను సైతం లెక్కచేయని పరిస్థితులకు దారితీస్తుందన్నారు. వాటి నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టెలిమానస్ కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకురాలు ఉమ, పీహెచ్ఎన్ అన్నపూర్ణ పాల్గొన్నారు.